ప్రజాశక్తి
శనివారం 10 ఆగస్టు 2024
5
పార్వతీపురం మన్యం

శివ్వాం దళితుల దీక్షలకు వ్యకాస మద్దతు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

శివ్వాం దళితుల భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న నిరాహార దీక్షలకు వీరఘట్టం, పాలకొండ కార్యకర్తలు, మద్దతుగా పాల్గొన్నారు. శుక్రవారం జరుగుతున్న నిరాహారదీక్ష శిబిరంలో వీరఘట్టం, పాలకొండ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సింహాచలం, దుర్గారావు, ఆర్.శివ, వెంకట్రావు మాట్లాడుతూ దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, దళితుల భూమి వారికి అప్పగించాలని, జిల్లాలోని వివిధ మండలాల్లో సాగు చేస్తున్న గిరిజనులు, దళితులు, బిసిలకు పట్టాలిచ్చి భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. నిర్లక్ష్యం వహిస్తున్న రెవెన్యూ అధికారుల సమస్య పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేయాలని కోరారు.

గిరిజనులు ఆర్థికంగా ఎదగాలి : కలెక్టర్

అడవి తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్, ఐటిడిఎ పిఒ

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గిరిజనులంటే చాలా గొప్పవారని, అందుకే ఐక్యరాజ్యసమితి సైతం గిరిజనుల కోసం ఒక ప్రత్యేకమైన రోజును ప్రకటించిందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచమంతా తలెత్తుకొనేలా గిరిజనులు ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ జిల్లా స్థాయి వేడుకలు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, తోయక జగదీశ్వరి, రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు, జెసి ఎస్ఎస్ శోభిక, ఐటిడిఎ పిఒ ఎస్.సేధుమాధవన్‌తో కలిసి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. గిరిజన నేతలు ఘంటం దొర, మల్లు దొర తదితర విప్లవ పోరాట యోధుల చిత్రపటాలకు పూలాభిషేకం చేశారు. అనంతరం ఎస్పీ ఎస్‌వీమాధవ రెడ్డి, జెసి, ఎంఎల్ఎలు, రాష్ట్ర ఎస్.టి కమిషన్ చైర్మన్ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. తొలుత ఐటిడిఎ ప్రాంగణంలో గల అడవి తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా ప్రమాణాలు పెంచి, నాణ్యమైన విద్యతో పిల్లలు మంచి రంగాల్లోకి వెళ్లేలా చూస్తానని అన్నారు. విద్యతో పాటు ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమని, ఆరోగ్యం బాగాలేక డోలీల ద్వారా అవకాశం రాకుండా ఉండాలంటే రహదారులు అవసరమని అన్నారు. ఇందుకోసం రూ.200 కోట్ల ఖర్చుతో రహదారులకు ఆమోదం తెలిపామని, వెంటనే ఆ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లాలో విద్య, ఉపాధి అవకాశాలు తక్కువ కాకుండా చూడాల్సిన పరిస్థితి మనపై ఉందని, ప్రస్తుతం మహిళలు, యువకులు స్వయం ఉపాధితో ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీతో అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. గిరిజనులు మూఢనమ్మకాలను పారద్రోలాలని, బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆదివాసీ దినోత్సవం పండగ మాత్రమే కాదని, అవగాహన కోసమని అన్నారు. జిల్లాలో నాటు సారాను ప్రోత్సహించకుండా, వాటి పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజల్లో పారిశుధ్యం పట్ల అవగాహన కల్పించేందుకు పారిశుద్ధ్య పక్షోత్సవాలను నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి ఆడపిల్ల 18 ఏళ్ల వరకు చదువుకునేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని, వచ్చే ఏడాది ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున అలా చదివించే 10 మంది తల్లిదండ్రులను సత్కరించనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యేలు విజయచంద్ర, జగదీశ్వరీ మాట్లాడుతూ వ్యవసాయం, ఉద్యానవన పంటల వైపు గిరిజనులను ప్రోత్సహిస్తామని చెప్పారు. గిరిజనుల ఉద్యోగాలు వారికే వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఎస్‌టి కమిషనర్ శంకరరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా నిలిచిపోయిన గిరిపుత్రుల పనులను త్వరితగతిన చేపడతామని హామీ ఇచ్చారు. జెసి శోబిక మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం, ఐటిడిఎ ఎంతో శ్రమిస్తుందని గుర్తుచేశారు. ఐటిడిఎ పిఒ సేధు మాధవన్ మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో విద్య, వైద్యం, మౌలిక వసతులు, వ్యవసాయం, ఉపాధిహామీ పథకాలు, వెలుగు, వాటర్ షెడ్ ప్రోజెక్టుల ద్వారా గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. అటవీ హక్కుల చట్టం కింద 50వేల మంది గిరిజన రైతులకు భూపట్టాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. గిరిజన గ్రామాల్లో టెలీ కమ్యూనికేషన్ కొరకు 50 సెల్ టవర్లను ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ఆమోదించినట్లు తెలిపారు. అటవీ ఉత్పత్తులపై ఆదాయం పెంచేందుకు 64 మండల వికాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, అనేక మందికి వ్యవసాయ పనిముట్లను అందించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఛాయాచిత్రం ప్రదర్శన ఏర్పాటు చేయగా, జిసిసి, వ్యవసాయ - ఉద్యాన శాఖలు, మహిళా శిశు సంక్షేమ శాఖ, డి ఆర్ డి ఎ, వైద్య ఆరోగ్య శాఖ తమ ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. మత్స్య శాఖ, డిఆర్‌డిఎ లబ్ధిదారులకు ఆస్తులను పంపిణీ చేశారు. గర్భిణీలకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి సునీల్ షరోన్, డిఆర్ఒ జి.కేశవనాయుడు, ఆర్‌డిఒలు కె.హేమలత, వివి రమణ, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచులు, గిరిజన ఆదివాసీ సంఘాల నాయకులు, గిరిజన ప్రజలు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆదివాసీ ఉత్సవాల సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన వేడుకల్లో గిరిజన సంక్షేమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కురుకూటి ఆశ్రమపాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన థింసా నృత్యం, కురుపాం గిరిజన సంక్షేమ పాఠశాల బాలికలు ప్రదర్శించిన కంది కొత్తల బాలే ఎంతగానో ఆకర్షించింది. కురుకూటి ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన జాతాపు నృత్యం, గుమ్మలక్ష్మీపురం ఇఎంఆర్ఎస్ విద్యార్థులు ప్రదర్శించిన సవర డాన్స్ ఆకట్టుకుంది. సాంస్కృతిక ప్రదర్శన అనంతరం విద్యార్థులు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, రాష్ట్ర ఎస్టీ కమిషనర్ డివిజి శంకర్రావు తో కలిసి ప్రత్యేకంగా ఫోటోలు దిగారు.

అడవితల్లికి చీర, సారె తీసుకెళ్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, పిఒ

అర్హులైన గిరిజనులకు రుణాలు పంపిణీ

ఆదివాసీ ఉత్సవాల్లో భాగంగా ఐటిడిఎ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన అర్హులైన గిరిజనులకు రుణాల ద్వారా పలు రకాల ఆస్తులను పంపిణీ చేశారు. ఒక్కొక్కటి రూ.89 వేలు విలువ చేసే ఆయిల్ ఇంజిన్‌ను ముగ్గురు రైతులకు కలెక్టర్ అందజేశారు. అలాగే ఇద్దరు మత్స్యకారులకు రూ.1,64,000 టీవీఎస్ మోపెడ్లు, అధునాతన వలలు పంపిణీ చేశారు. రూ.38వేలు విలువ చేసే రెండు స్పింకర్లు, రూ.రెండు లక్షలు విలువ చేసే పశువులు, రూ.50వేలు విలువచేసే పౌల్ట్రీ యూనిట్లు, రూ.ఆరు లక్షల విలువచేసే 2ఆటోలు లబ్ధిదారులకు అందజేశారు.

గిరిజనాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే, పిఒ

సీతంపేట : ప్రపంచ ఆదివాసి దినోత్సవం స్థానిక ఐటిడిఎ ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో పిఒ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ నుండి పిఒ, ఎమ్మెల్యే, అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీగా వచ్చి ఐటిడిఎ ముఖద్వారం వద్ద గల అడవి తల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియానికి ఎమ్మెల్యే, పిఒ గిరిజనుల వేషధారణలో ర్యాలీగా వెళ్లడంతో పలువురని ఆకట్టుకున్నాయి. గ్రీన్ ఫీల్డ్ స్టేడియం గ్రౌండ్ లో ఉన్న ఐసిడిఎస్, స్కిల్ డెవలప్మెంట్, వైద్య శాఖ, హార్టికల్చర్, వెలుగు స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో విద్యార్థులు చేసిన సాంస్కత కార్యక్రమాలు తిలకిస్తూ ఎమ్మెల్యే, పిఒ విద్యార్థులు చేసిన నృత్యంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే జయకృ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. గిరిజన గ్రామాల్లో తాగునీరు, రోడ్ల కల్పనకు కృషి చేస్తానన్నారు. మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు వేగవంతంగా జరగాలనిన్నారు. జీవో 3 పునరుద్ధరణకు కృషి చేస్తామన్నారు. పిఒ రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా వేదిక మండలాల్లో, గ్రామాల్లో నిర్వహిస్తామని అన్నారు. అనంతరం ఆదివాసీ సీనియర్ నాయకులను శాలువాతో సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకరరావు పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి, రాష్ట్ర కార్యదర్శి చంద్రరావు, తేజోవతి, హెచ్ ప్రసాద్, ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, ఇఇ సింహాచలం, పిహెచ్ఒ గణేష్, ఆర్ట్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఎన్.సన్యాసిరావు, గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు బి.తేజేశ్వరరావు, లక్ష్మీనారాయణ, నిమ్మక కాంతారావు, కొండగొర్రె సుబ్బారావు, డిఎస్‌పి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

అలరించిన ఆదివాసీ ఉత్సవాలు

ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదివాసీ ఉత్సవాలు ఎంతగానో అలరించాయి. ఎన్నడూ లేని విధంగా గిరిజన సంస్కృతిని తెలియజేసే జెసిసి, మహిళ మండల సమైక్యకు చెందిన గిరిజన ఉత్పత్తులు అమ్మకాల స్టాళ్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ముందుగా సంప్రదాయ పద్ధతిలో ఐటిడిఎ పిఒ సేధు మాధవన్‌తో కలిసి కలెక్టర్ శ్యాం ప్రసాద్ చీర, సారె ఉన్న బుట్టలను తలపై పెట్టుకొని మేళతాళాలతో ఐటిడిఎ ప్రాంగణంలోని అడవి తల్లి విగ్రహం వద్దకు వెళ్లి పట్టు వస్త్రాలు సమర్పించి విగ్రహానికి పాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవంగా జూనియర్ కళాశాల మైదానానికి చేరుకున్నారు. వీరితో పాటు ఎమ్మెల్యే విజయచంద్రకు గిరిజనులు సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికి వేదిక దగ్గరకు తీసుకువెళ్లారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి, గిరిజన పోరాట యోధులు, స్వాతంత్ర వీరుల ఫోటోలకు నివాళులర్పించారు. అనంతరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను జిల్లా కలెక్టర్ తిలకించారు. అనంతరం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఆదివాసీ ఉత్సవాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రసంగాలను ఆహుతులతో కలిసి తిలకించారు. ఆ తర్వాత జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో గిరిజన సంక్షేమ పాఠశాలలకు చెందిన బాలికలు ప్రదర్శించిన థింసా, కోయ, లంబాడి నృత్యాలను తిలకించారు. అనంతరం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అధ్యక్షత వహించగా, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా వ్యవహరించి ప్రసంగించారు.

లబ్ధిదారునికి ఉపకరణాలు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పూర్ణపాడు - లాబేసు వంతెనను పూర్తికి సిఎం హామీ

కొమరాడ : మండలంలో గల పూర్ణపాడు- లాబేసు వంతెనను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. శుక్రవారం విజయవాడలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకల్లో పాల్గొన్నా కొమరాడ మండలంలో దీర్ఘకాల సమస్యగా ఉన్న ఈ వంతెన పనులు పూర్తి చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడం తో గిరిజన ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలోనే వంతెన 70శాతం పనులు జరిగాయని, ఇప్పుడు కూడా టిడిపి ప్రభుత్వ హయాంలోనే వంతెన పనులు పూర్తి చేస్తామని టిడిపి ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి కూడా గతంలో హామీ ఇవ్వడంపై గిరిజన సంఘాలు గిరిజన ప్రజలు టిడిపి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వంతెన పూర్తయితే తొమ్మిది పంచాయతీల ప్రజలతో పాటు మూడు మండలాల ప్రజలకు అటు ఒడిస్సా రాష్ట్రం ప్రజలకు ఉపయోగపడుతుందని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు. వంతెన నిర్మాణంపై రాష్ట్ర ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంపై ఈ ప్రాంత ప్రజలు చంద్రబాబు నాయుడును అభినందిస్తున్నారు. వర్షాలు తగ్గిన వెంటనే వంతెన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని స్థానిక ఎమ్మెల్యే తెలిపారు.

ఉత్తమ రైతులు, విద్యార్థులకు సత్కారం

జిల్లాలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన ఉత్తమ రైతులను కలెక్టర్ దుశ్శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సేంద్రియ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేసి అధిక దిగుబడి సాధించిన గుమ్మలక్ష్మీపురం మండలం బొడ్లగూడకు చెందిన రైతు నిమ్మక సీతారామ్‌కు కలెక్టర్ జ్ఞాపికను అందించి, దుస్సాలువతో సత్కరించారు. అలాగే సేంద్రియ ఎరువులతో వరి సాగు చేసిన పాచిపెంట మండలం అమ్మవలసకు చెందిన రైతు రెయ్యి అప్పారావు, కొండ చీపుర్లు, పసుపు దిగుబడి చేసిన మక్కువ మండలం దుగ్గేరు రైతు కొండతామర లతకు, రుణం తీసుకొని చిరు వ్యాపారాలు చేసి ఆదాయ అభివృద్ధి చేసుకున్న సాలూరు మండలం పట్టు చెన్నూరు వాసి తాడంగి శింగమ్మ, పోలమ్మలను కలెక్టర్ ఘనంగా సత్కరించారు. అలాగే పదో తరగతి, ఇంటర్‌లో టాపర్స్ గా నిలిచిన అడ్డాకుల బిందుమతి, నిమ్మక సంతోష్, వాలీబాలలో రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాన్ని సాధించిన తిమ్మక దీపక్ బృందానికి కలెక్టర్ దుస్సాలువ, జ్ఞాపికతో సత్కరించారు.



సీతంపేటలో అడవితల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న పిఒ, ఎమ్మెల్యే



రక్తదానం చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఐటిడిఎ పిఒ మాధవన్

మేము సైతం అంటూ...

రక్తదాన ఉద్యమంలో కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మేము సైతం అంటూ... రక్తదాన ఉద్యమంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ముందుకొచ్చారు. "మేము సైతం" పేరుతో చేపట్టిన రక్తదాన ఉద్యమం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున శుక్రవారం కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగిన ఈ రక్తదాన ఉద్యమంలో కలెక్టర్ స్ఫూర్తితో ఉద్యోగులు ముందుకొచ్చారు. ఈ శిబిరంలో 138మంది రక్తదానం చేసేందుకు పేర్లు నమోదు చేసుకోగా, 75మంది అర్హత సాధించి, రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ స్థానిక రక్త డిమాండ్‌ను తీర్చడం, దీర్ఘకాలిక రక్త కొరతను పరిష్కరించడం, రక్తదానం ప్రాముఖ్యత, ప్రాణాలను రక్షించడంలో దాని ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించడం, జిల్లాలో సాధారణ రక్తదాతల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం ప్రధాన లక్ష్యంగా చేపట్టామన్నారు. అన్ని మండలాల్లో శిబిరాలు నిర్వహించేలా కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. జిల్లాలో 50 రోజుల వ్యవధిలో మొదటి దశ పూర్తవుతుందని, వారం రోజుల నుంచి పది రోజుల వ్యవధిలో మండలాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నామని చెప్పారు. జిల్లాలో రక్తం కొరత ఉందని, ప్రత్యేకించి ప్రసవాలు, ప్రమాదాల సమయంలో కొన్ని సమయాల్లో చాలా అసౌకర్యానికి గురవుతున్నామని అన్నారు. రక్తాన్ని సేకరించేందుకు అన్ని బ్లడ్ గ్రూపుల లభ్యతను చూడ్డానికి "మేము సైతం" ప్రారంభించామని అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక మాట్లాడుతూ మేము సైతం కార్యక్రమంలో రక్తదాతగా నమోదు చేసుకోవడానికి వెబ్ పోర్టల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కో శిబిరంలో కనీసం 50 యూనిట్లు సేకరించాలని లక్ష్యంగా ఉన్నామని తెలిపారు. మండలంలో రక్తదాన శిబిరాలను సమన్వయం చేసేందుకు మండల స్థాయిలో ఎంపిడిఒలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని శోబిక చెప్పారు. కార్యక్రమానికి మండల స్థాయి షెడ్యూల్ తయారు చేశామన్నారు. ఈనెల 12న గుమ్మలక్ష్మీపురంలో, 26న కురుపాంలో, సెప్టెంబర్ 5న పాలకొండలో, 15న సీతంపేటలో, 28న పాచిపెంటలో, అక్టోబర్ 2న వీరఘట్టంలో, 12న జియ్యమ్మవలసలో, 22న సీతానగరంలో, నవంబర్ 2న బలిజిపేటలో, 14న సాలూరులో, 26న భామినిలో, డిసెంబర్ 1న మక్కువలో, 10న కొమరాడలో, 24న గరుగుబిల్లిలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ ఎస్. సేధు మాధవన్, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

వీరఘట్టం : పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం సర్పంచులకు, సచివాలయాల కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శుల శిక్షణా తరగతుల్లో మాట్లాడారు. జిపిడిపి ఆధారంగా ప్రణాళిక వేసుకుని అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, సచివాలయ కార్యదర్శులు, పాల్గొన్నారు.

క్విట్ కార్పొరేట్‌కు ప్రజలు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలపై మరో స్వాతంత్ర్య పోరాటానికి క్విట్ ఇండియా స్ఫూర్తితో క్విట్ కార్పొరేట్ పోరాటానికి దేశ ప్రజలంతా సిద్ధం కావాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, రైతు కూలీ సంఘం నాయకులు పి.రమణి పిలుపునిచ్చారు. రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ బంటు దాసు ఆధ్వర్యంలో శుక్రవారం రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో క్విట్ ఇండియా దినాన్ని పురస్కరించుకొని క్విట్ కార్పొరేట్ పేరిట స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఈ పదేళ్లలో మోడీ అనుసరించిన కార్పొరేట్ అనుకూల విధానాలు భారతదేశంలో పేదరికాన్ని పెంచిందని, నిరుద్యోగం పెద్దఎత్తున పెరిగిందని, అసమానతలు విపరీతంగా పెరిగి ప్రజల ఆదాయాలు పడిపోయాయని, రైతుల ఆత్మహత్యలు రెట్టింపయ్యాయని విమర్శించారు. బంగ్లాదేశ్లో ప్రజలు ఎలాంటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారో, అలాంటి పరిస్థితులే భారతదేశంలో మోడీ ప్రభుత్వం సృష్టించిందని విమర్శించారు. దీనికి అదనంగా పరమత ద్వేషం పెరిగి కలిసి మెలిసి ఉండే ప్రజల మధ్య విద్వేషాలు మోడీ పరివారం సృష్టిస్తూ దేశాభివృద్ధికి మతోన్మాద విధానాలు ఆటంకంగా మారాయని తెలిపారు. బడ్జెట్‌లో ప్రజలపై భారాలు పెంచారని, నిత్యావసరాల ధరల అదుపునకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఉపాధి కల్పించే ప్రభుత్వరంగ సంస్థల అమ్మకం ద్వారా ఆదాయం పొందాలనే దివాళాకోరు విధానాలు అమలుపరుస్తామని గొప్పగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను రద్దుచేసి, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, రైతాంగ పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేసి రైతుల ఆత్మహత్యలు నివారించాలని, రైతులకు రుణమాఫీ చేయాలని, నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు తగ్గించి, పెట్రోల్, డీజిల్ జిఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో 18 లక్షల ఖాళీ పోస్టులను తక్షణం భర్తీచేసి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, విశాఖ ఉక్కు, ప్రభుత్వరంగ సంస్థల ప్రేవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటీ కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు బాషా, టి.జీవా, బి.నర్సింగరావు, పి.సంగం, రెడ్డి ఈశ్వరరావు, రెడ్డి లక్ష్మునాయుడు, శ్రీనునాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, నాయకులు జి.వెంకటరమణ బి.సూరిబాబు, జి.వెంకటరమణ, వెంకటరమణ, అప్పలనాయుడు, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సంయుక్త కిసాన్ మోర్చా, కార్మికసంఘాల నాయకులు

చెరకు ఉత్పత్తిదారుల సొసైటీ చైర్మన్‌గా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - సీతానగరం

శ్రీరామ షుగర్ కేన్ సొసైటీ ఎన్నికలు శుక్రవారం బొబ్బిలిలో నిర్వహించారు. బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు బేబి నాయన, బోనెల విజయ్ చంద్ర ఆశీస్సులతో ఛైర్మెన్‌గా సబ్బాన శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా బేతనపల్లి సత్యం, డైరెక్టర్లుగా సాలారి గోపాల్, బొన్నాడ సత్యనారాయణ, బలగ శ్రీనివాసరావును సభ్యులుగా ప్రతిపాదించగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గాల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు. కొత్త ఛైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను వారంతా అభినందించారు.

రూరల్ సిఐగా గోవిందరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక రూరల్ సిఐగా ఎస్.గోవిందరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం నుంచి బదిలీపై వచ్చిన ఈయన బాధ్యతలు స్వీకరించడం పట్ల ఎస్సైలు దినకర్, రాజేష్ తదితరులు అభినందనలు తెలిపారు. ఇప్పటి వరకు సిఐగా విధులు నిర్వహించిన కె.రవికుమార్ బదిలీపై ఎస్.కోట సర్కిల్‌కు వెళ్లారు. గోవిందరావు మాట్లాడుతూ పార్వతీపురం సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సారా రవాణా, అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్మూలనకు కషి చేస్తామన్నారు.

ఫీడర్ అంబులెన్స్‌లో ప్రసవించిన బుల్లి

బైక్‌పై తీసుకొచ్చి.. ఫీడర్ అంబులెన్స్ ఎక్కించి

మార్గం మధ్యలో ప్రసవం.. తల్లీ బిడ్డ క్షేమం

ప్రజాశక్తి - మక్కువ

గిరిజన గ్రామమైన వీరమాసిలో ఓ గర్భిణికి ప్రసవ నొప్పులు ప్రారంభమయ్యాయి. సుమారు 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆమెను అక్కడ నుండి 10 కిలోమీటర్లు మోటారు బైకుపై తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో ఫీడర్ అంబులెన్స్ రావడంతో గర్భిణిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. మరో 5 కిలోమీటర్లు దూరంలో ఆసుపత్రికి చేరుద్దామన్న ముందే అంబులెన్స్‌లో ఆమె ప్రసవించాల్సిన దుస్థితి ఏర్పడింది. శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. శుక్రవారం శంబర పంచాయతీ వీరమాసికి చెందిన చౌడిపల్లి ఉత్తర భార్య బుల్లి గర్భిణి కావడంతో ఉదయం పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో భర్త ఉత్తర అంబులెన్స్‌కు ఫోన్ చేసినప్పటికీ ఆలస్యం కావడంతో ఇంటి నుండి డోలితో నంద గ్రామానికి తీసుకొచ్చి అక్కడ నుంచి ఏ వాహనాలు లేకపోవడంతో బైక్‌పై పెద్దవలస వరకు తీసుకొచ్చారు. అక్కడికి ఫీడర్ అంబులెన్స్ రావడంతో ఆమెను ఎక్కించగా, కొద్ది దూరం వెళ్లాక అంబులెన్స్‌లో మగ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం శంబర పిహెచ్‌సిలో తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు

కెజిబివి విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి అరుణశ్రీ

కెజిబివిని పరిశీలించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట కస్తూరిబాయి బాలిక పాఠశాలలో బొబ్బిలి కోర్ట్ జడ్జి, లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు ఎస్.అరుణశ్రీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాలికలతో మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింసలు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జె.సంధ్యారాణి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీలో ఆటల సందడి

ప్రజాశక్తి - పాలకొండ

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులు సందడిగా, ఉత్సాహంగా ఉల్లాసంగా క్రీడల్లో పాల్గొన్నారు. బాలురు, బాలికలు కబడ్డీ, వాలీబాల్, టెన్నీకాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, పరుగు పందాల్లో ప్రతిభ చూపించారు. అలాగే వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లోనూ పాల్గొన్నారు. ఆగస్టు 15న జాతీయ పతాకావిష్కరణ అనంతరం బహుమతులు ప్రదానం చేస్తామని ప్రిన్సిపల్ హరగోపాల్ తెలిపారు. కాలేజీ వ్యాయామ అధ్యాపకులు సాసుబిల్లి నాగభూషణరావు ఆధ్వర్యంలో ఉత్సాహంగా క్రీడలు నిర్వహించారు. కళాశాల సిబ్బంది గోవిందరావు, శివానంద, వెంకటేశ్వర్, వెంకటరమణ, రవిశంకర్ మరియు వెలమల అప్పారావు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని పెదగుడబలో అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నప్రాసన కార్యక్రమానికి అవసరమైన సామాగ్రిని అంగన్వాడీ కార్యకర్త చింతాడ గౌరమ్మ సమకూర్చారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో గుంటు ధ్రువ అనే పాపకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ మహిళా సంరక్షణ అధికారి, తది తరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు అందజేస్తున్న శ్రీనివాసరావు

పాఠశాలకు పూర్వ విద్యార్థి వితరణ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి అంధవరపు శ్రీనివాసరావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావుకు శుక్రవారం పాఠశాల వద్ద కుర్చీలు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలలో ప్రస్తుతం తన కుమార్తె సౌమ్య పదవ తరగతి చదువుతుందని, తనకు ఎంతో గర్వకారణంగా ఉందని అన్నారు. పాఠశాలకు ఉపయోగపడే వస్తువులను అందజేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై అవగాహన కల్పిస్తున్న ఎసార్పి దాసు

పక్కాగా సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో గత ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి గ్రామాల్లో పక్కాగా సామాజిక తనిఖీలు నిర్వహించాలని ఎస్ఆర్పి బి దాసు సామాజిక తనిఖీ బృందాన్ని ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధి చట్టం ద్వారా 820 పనులకు రూ.17 కోట్ల 19 లక్షలు, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 29 పనులకు రూ.కోటీ 93 లక్షలు, ఐటిడిఎ ఆరు పనులకు రూ.కోటీ 74 లక్షలు, ఆర్డబ్ల్యూఎస్ ఆరు పనులకు రూ.74 లక్షలు, ఎస్ఎస్ఎ 9 పనులకు సంబంధించి రూ.5 లక్షలు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ జనవరి నుండి జూన్ వరకు 10,109 మందికి పంపిణీ సంబంధించి తనిఖీలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. సమగ్ర తనిఖీలు నిర్వహించాలని బందాలకు ఆదేశించారు. ఈనెల 10నుంచి 27 వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించడం జరుగుతోందని, ఈనెల 28న మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలో ఏడుగురు డిఆర్పిలు 14 మంది పిఎస్ఎలు పాల్గొంటారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ సత్యంనాయుడు, ఇంజనీరింగ్ కన్సల్టింగ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులను గుర్తించండి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గర్భిణీల ఆరోగ్య శ్రేయస్సుకై అంకిత భావంతో వైద్య సేవలు అందజేయాలని వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ సిబ్బందికి సూచించారు. పిఎంఎస్ఎంఎ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గర్భిణీలకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు, మాతా శిశు సంరక్షణ కార్డులు పరిశీలించారు. కొత్తగా ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే హైరిస్క్‌గా పరిగణించి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గర్భిణుల ఆరోగ్య సమస్యలను క్షేత్ర స్థాయి సిబ్బంది సులభంగా గుర్తించే పద్ధతులను వివరించారు. గర్భిణులు ఎలా నడుచుకోవాలో పలు ఆరోగ్య సలహాలు, సూచించారు. ప్రిజం10 ఉద్దేశ్యాన్ని వారికి వివరిస్తూ ప్రస్తుత కార్యాచరణపై సిబ్బందికి సూచనలు చేశారు. రక్తహీనతగా గుర్తించిన గర్భిణీలకు సిబ్బంది సమిష్టి కృషితో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. తల్లి పాలు తల్లీ బిడ్డలకు క్షేమమని, అందుకు గర్భిణీగా ఉన్నప్పుడు పోషకాహారం తీసుకోవాలని అన్నారు. అప్పుడే తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. సీజనల్ వ్యాధులకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గర్భిణీలకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు చిన్నమ్మి, రమణమ్మ, ఉదయకుమారి, ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు సూచనలు ఇస్తున్న వైద్యాధికారి సంతోష్‌కుమార్

గిరిజనుల హక్కులు, చట్టాల పరిరక్షణకు

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

గిరిజన సంఘాల జెఎసి చైర్మన్ లక్ష్మణమూర్తి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

గిరిజనుల హక్కులు, చట్టాలు పరిరక్షణకు గిరిజనులంతా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని గిరిజన జెఎసి చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ అధ్యక్షతన స్థానిక వైటిసిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణమూర్తి మాట్లాడుతూ నేటి పాలక ప్రభుత్వాలు తమ స్వలాభం కోసం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ గిరిజనులను మోసగించే పనిలో ఉన్నాయే తప్ప వారి హక్కులు, చట్టాలకు ఏమాత్రం కూడా భద్రత కల్పించడం లేదని అన్నారు. ఇది రాబోయే తరానికి పెనుముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 1994 నుంచి ఆదివాసీ దినోత్సవం ఒక్కటి ఉండని ఐక్యరాజ్యసమితి ప్రకటించడంతో యుఎన్ ప్రపంచంలో నిర్వహించిందని తెలిపారు. అనాటి నుంచి నేటి వరకు ప్రతి ఏటా గిరిజనులంతా ఐక్యంగా చేరి ఆదివాసీ దినోత్సవం వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఆదివాసీ ఉత్సవాలను ప్రభుత్వం ఐటిడిఎ పరిధిలో మాత్రమే నిర్వహిస్తుందని తప్ప ఎక్కువ శాతం మంది గిరిజనులు ఉన్న ప్రాంతంలో నిర్వహించకపోవడం గిరిజనుల పట్ల చిన్నచూపే అని అన్నారు. తరాల మారుతున్న గిరిజన సంక్షేమం, అభివృద్ధి పై పాలకులు ఏమాత్రం శ్రద్ధ లేదన్నారు. రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన హక్కులు, చట్టాలు రోజురోజుకు నిర్వీర్యమవుతున్నా వీటిని పరిక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. ఇందులో భాగంగానే జిఒ 3 ఎత్తి వేయడంతో నిరుద్యోగ గిరిజన యువతి,యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకుండాపోయాయని అన్నారు. దీంతో గిరిజనులకు తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు. జిల్లాల విభజనలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పడిన ఏమాత్రం గిరిజన బతుకులకు అంతంతమాత్రంగానే ఉన్నాయని పేర్కొన్నారు. గిరిజన అభివృద్ధి పేరిట వస్తున్న నిధులు పక్కదారి పడుతున్నాయన్నారు. ఏజెన్సీలో ప్రాంతంలో ఉండవలసిన ఐటిడిఎ అధికారుల స్వలాభం, ప్రయాణ ప్రయాస కోసం మైదాన ప్రాంతమైన పార్వతీపురంలో ఏర్పాటు చేయడంతో గిరిజన అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ఐటిడిఎ గిరిజనేతరుల పాలక కేంద్రంగా మారిందని ఎద్దేవా చేశారు.కోలక అవినాష్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గిరిజనుల హక్కులు, చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా పాలన సాగిస్తున్నారు. గిరిజన సంక్షేమం విస్మరించి అదాని, అంబాని వంటి కార్పొరేట్ వ్యక్తులతో చేతులు కలిపి మైనింగ్ పేరుతో ఆదివాసీలను అడవి నుంచి దూరం చేసే కుట్ర పన్నుతోందన్నారు. ఇదే జరిగితే భవిష్యత్తులో ఆదివాసీల జీవనం అగమ్య గోచరంగా ఉంటుందని అన్నారు. అటవీహక్కుల చట్టం, పీసా చట్టం,1/70 చట్టం, అమలు జరగడం లేదన్నారు. జిఒ నెంబర్3 ఎత్తివేసి గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేశారన్నారు. దీంతో జిల్లాలో ఉపాధి లేక వందలాదిమంది గిరిజనులు బతుకు తెరువు కోసం వలసలు వెళ్లాల్సి వస్తుందన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శన్ రావు మాట్లాడుతూ ఐక్యంగా ఉన్న నాడే గిరిజనుల హక్కులు, చట్టాలకు రక్షణ ఉంటుందని అన్నారు. సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఆదివాసీపై ఉందన్నారు. ఆదివాసీ జెఎసి నాయకులు మండంగి భూషణ మాట్లాడుతూ ఆదివాసీ పండగలకు ప్రభుత్వం ప్రోత్సహించే సహకారం అందించాలని కోరారు. ఆదివాసీల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విద్యార్థులతో జట్టు కట్టి నత్యం చేశారు. ఆదివాసీల హక్కులు, సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని సందర్భంగా చెప్పారు. ఆదివాసీ జెండా ఎగురవేసి ఎల్విన్ పేట నుంచి గుమ్మలక్ష్మీపురం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీల ఐక్యత వర్ధిల్లాలి, హక్కులకే ఐక్యంగా ఉద్యమించాలి, జై ఆదివాసీ జై జై ఆదివాసీ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు, టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి, కడ్రక కళావతి, వెంపటాపు భారతి, పువ్వల లావణ్య, జనసేన సమన్వయకర్త కడ్రక మలేశ్వరరావు, డుమ్మంగి సర్పంచి పాలక క్రాంతికుమార్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్, మండల

అడవితల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న రాజన్నదొర

గిరిజన యూనివర్సిటీ ఏజెన్సీలోనే ఉండాలి : రాజన్నదొర

సాలూరు: కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ గిరిజన నియోజకవర్గంలోనే వుండాలని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సందర్భంగా శుక్రవారం మండలంలోని తోణాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత గిరిజన మహిళలు మేళతాళాలతో ఆయన కు స్వాగతం పలికారు.ఆదివాసీ జెండా ఎగురవేశారు.అడవితల్లి చిత్రపటానికి పూలమాల వేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన యూనివర్సిటీని గిరిజన నియోజకవర్గంలో నే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 3ను పునరుద్ధరిస్తామని సిఎం, విద్యాశాఖామంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ లో లేని గిరిజన గ్రామాలను షెడ్యూల్ జాబితాలో చేర్చాల్సిన అవసరం వుందన్నారు.

ఆదివాసీ నాయకులు లేకుండా ఉత్సవాలా?

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పార్వతీపురంలో నిర్వహించిన ఉత్సవాలకు ఆదివాసీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులను పిలవకపోవడం అన్యాయమని రాజన్నదొర చెప్పారు. ఐటిడిఎలో నిర్వహించిన ఆదివాసీ ఉత్సవాలకు తనను గానీ, ఇతర గిరిజన మాజీ ఎమ్మెల్యేలను గానీ ఆహ్వానించలేదన్నారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహించుకునే పండుగకు అన్ని గిరిజన సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులను పిలవకపోవడం ద్వారా అధికారులు కొత్త సాంప్రదాయానికి తెరలేపారని చెప్పారు. అంతకుముందు కొత్తవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు, తోణాం ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు చేసిన గిరిజన సాంప్రదాయ నృత్యాలు ఆహూతులను అలరించాయి. అనంతరం రాజన్నదొరను సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, మండల వైసిపి అధ్యక్షుడు పువ్వాడ భరత్ శ్రీనివాసరావు, ఎఎంసి మాజీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, సర్పంచ్ ముడ్వల ఆదియ్య, పి.సుదర్శనరావు, నూకయ్య, ఎన్.కళ్యాణ్, వైసిపి నాయకులు కొండగొర్రి ఉదయ్ కుమార్, జయసింహ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో ర్యాలీ చేస్తున్న గిరిజన జెఎసి నాయకులు

కార్యదర్శి పత్రిక శంకర్‌రావు, ఆదివాసీ జెఎసి నాయకులు ఆడ్డాకుల నరేష్, మధు, లక్ష్మణరావు, పలువురు ఉపాధ్యాయులు, నాయకులు ఉన్నారు.

అఖిల భారత ఆదివాసీ వేదిక ఆధ్వర్యంలో...

పార్వతీపురంరూరల్ : ఆదివాసీ హక్కుల పరిరక్షణకై ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని అఖిల భారత ఆదివాసీ వేదిక జాతీయ కమిటీ సభ్యులు శంభుడు జయలక్ష్మి పిలుపునిచ్చారు. మండలంలోని రావికోన, బట్టి వలసలో ఆదివాసీ దినోత్సవ సందర్భంగా గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఎ.ఐ.కె.ఎం.ఎస్) జిల్లా ఉపాధ్యక్షులు బొత్స నర్సింగరావు, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

కొమరాడ : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం స్ఫూర్తితో గిరిజన హక్కులు సాధించుకునే దిశగా గిరిజన యువత ముందుకు రావాలని గిరిజన సంఘం నాయకులు ప్రసాద్, నాగేశ్వరరావు, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి ఆదివాసీ గిరిజన యువత, యువకులకు పిలుపునిచ్చారు. మండలంలోని పెద్ద శాఖ పంచాయతీ జల గ్రామంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సందర్భంగా యువకులు, శంబంగి సత్యనారాయణ, జెండాలు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శివ, గోపాల్, వెంకట్రావు, సుందర్రావు, లక్ష్మణరావు, కామయ్య, సీతయ్య, గిరిజన యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జట్టుఆశ్రమంలో...

గరుగుబిల్లి : మండలంలోని తోటపల్లి ప్రకృతి ఆదివేళవ ప్రాంగణంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆదితల్లి విగ్రహ రూపకర్త, జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు ఆదితల్లి విగ్రహానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ ప్రాముఖ్యతని వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు, రచయిత టి.శివాజీ, వాసుదేవరావు, శంబంగి సత్యనారాయణ, తోటపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని టి.పద్మ, జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సరోజ్ ప్రహరాజ్, జట్టు సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలోని పారమ్మకోట వద్ద శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మాజీ మంత్రివర్యులు పి రాజన్న దొర హాజరై కొండపై ఉన్న అడవి తల్లి విగ్రహానికి పూలదండ వేశారు. అలాగే ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత గిరిజనులందరిపై ఉందన్నారు. గిరిజన యువత థింసా నృత్యాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లూరి సీతారామకృష్ణ, చింత సీతయ్య, తాడంగి సింహాచలం, కోట జానకీరాం, కోట సింహాచలం గిరిజనులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలకు తూట్లు పొడుస్తున్న పాలకులు

సాలూరు : రాజ్యాంగంలో వున్న గిరిజన చట్టాలకు పాలకులు తూట్లు పొడుస్తున్నారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు అన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన పట్టణంలోని మున్సిపల్ పార్కులో గిరిజన సంఘం మండల కార్యదర్శి గేమ్మెల జానకిరావు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ గిరిజన గ్రామాలు అభివద్ధికి ఆమడ దూరంలో వున్నాయని, విద్య వైద్యం మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. వైద్యం కోసం నిత్యం పదుల కిలోమీటర్లు డోలీలు మోత తప్పడం లేదన్నారు .ఆదివాసీ దినోత్సవాలు నిర్వహించడం తోనే పాలక పార్టీలు సరిపెడుతున్నాయని తప్ప కనీస సదుపాయాలు కల్పించడం లేదని చెప్పారు. ఆదివాసీ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నంలో ప్రభుత్వాలు వున్నాయని అన్నారు. ఇప్పటికైనా గిరిజన ప్రాంతంలో ఉన్న సమస్యలను పరిష్కారం చేసి గిరిజన హక్కులను చట్టాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పండు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు చదువుకోవడానికి సరైన సౌకర్యాల్లేవన్నారు. ఆశ్రమ పాఠశాలలో ఉన్న అధ్యాపక, మిగిలిన ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని చెప్పారు. పట్టణంలో మంజూరైన ఆశ్రమ పాఠశాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులు ఆదివాసీ గిరిజన సంప్రదాయాలను థింసా నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు వంతల సుందర్రావు, సీనియర్ నాయకులు సూకూరు గంగయ్య, కమిటీ సభ్యులు మెల్లిక అయోధ్య, జిల్లా కమిటీ సభ్యులు మంచాల శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు గేమ్మెల నితిన్, బాలికల కన్వీనర్ మహా, ప్రజానాట్యమండలి నాయకులు కోరాడ ఈశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంతో మరింత అభివృద్ధి : కలెక్టర్

ప్రజాశక్తి - కొమరాడ

ఏజెన్సీలో గిరిజనులు వ్యవసాయంతో మరింత అభివృద్ధి చెందాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. మండలంలోని చోళ్లపదం పంచాయతీ ఇందిరానగరంలో శుక్రవారం గిరిజనులతో కలిసి ముఖాముఖిలో మాట్లాడారు. గ్రామంలో గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు ఏ విధంగా ఉన్నాయి, ఉద్యోగాలు చేస్తున్నారా లేదా అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయం చేస్తున్న గిరిజన రైతులతో మాట్లాడి వారి పెట్టుబడులు, ఆదాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ముఖ్యంగా వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెంది అధిక లాభాలు సంపాదించేలా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గిరిజన యువత యువకులు చదువుకొని మంచి ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. అనంతరం గిరిజన సంక్షేమ ఆశ్రమ గురుకుల బాలుర ఉన్నత పాఠశాలలో కలెక్టర్ పర్యటించారు. ముందుగా విద్యార్థులతో వాలీబాల్ ఆడి వారికి క్రీడలపై ఆసక్తి పెంచేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడారరంగంలో నైపుణ్యం పెంపొందించి మంచి ప్రవర్తనలు నేర్పాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణరావు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అందించే మెనూ ప్రకారం భోజనం నాణ్యతతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సేథూ మాధవన్, మండల అధికారులు, వివిధ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, పిఒ మాధవన్

వంతెన సమస్య పరిష్కరించాలి : సిపిఎం

మండలంలో దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు లాబేసు వంతెన సమస్య పరిష్కరించి, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. మండలంలో పర్యటించిన కలెక్టర్‌కు సమస్యలు వివరించారు. పార్వతీపురం నుంచి కూనేరు వరకు గల అంతర్ రాష్ట్ర రహదారి అధ్వానంగా తయారవడంతో నిత్యం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షం పడితే గోతుల్లో వర్షపు నీరు నిలువుండిపోయి అనేక ఇబ్బందులు పడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా స్పందించిన కలెక్టర్ త్వరలో వంతెన సమస్యతో పాటు రోడ్డు సమస్య పరిష్కరిస్తామన్నారు. రోడ్డు పనులకు నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

40 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ 40 మంది గర్భిణీలకు వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎత్తు, బరువు, మధుమేహం తదితరమైన వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం సుదూర ప్రాంతాల నుండి వచ్చిన గర్భిణులకు చిట్టపూడి వలస శ్రీ సత్య సాయి అన్నపూర్ణ సేవా కేంద్రం నుంచి ఉచిత భోజన సదుపాయం కల్పించారు. ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, పాల్గొన్నారు.

1నుంచి ఎఐటియుసి జాతీయ సమితి సమ్మేళనాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో విశాఖలోని గురజాడ కళాక్షేత్రంలో ఎఐటియుసి జాతీయసమితి సమ్మేళనాలు జరగనున్నాయని జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎఐటియుసి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈమేరకు శనివారం ముందుగా స్థానిక ఎన్జీఓ సమావేశం మందిరంలో జిల్లా సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, ఉమ్మడి జిల్లా కార్యదర్శి బుగత అశోక్, సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు హాజరు కానున్నారు. ఈ సమావేశానికి అన్ని రంగాల కార్మికులు హాజరు కావాలని కోరారు.

మేలైన సాగు పద్ధతులు రైతులకు తెలపాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రతి రైతు సేవా కేంద్రంలో పత్తిలో ఒక మోడల్‌ను ఏర్పాటు చేయాలని, దాని ద్వారా మేలైన సాగు వ్యవసాయ పద్ధతులను రైతులకు తెలపాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని రాయిగుడ్డివలస రైతు సేవా కేంద్రం పరిధిలోని రెట్లపాడులో మహిళా గిరిజన రైతు వేటుకూరి ఆదెమ్మ ఎకరా పత్తిలో మోడల్‌ను అభివృద్ధి చేశారు. ఈ పత్తి పంట చుట్టూ రెండు వరసల్లో మొక్కజొన్న, గట్ల మీద ఆముదం వరుసల మధ్యలో మినుములు వేయించారు. అక్కడక్కడ రసం పీల్చే పురుగుల ఉనికిని తెలుసుకోవడానికి నేల చిక్కుడు నాటారు. పొగాకులో లద్దె పురుగు పత్తి కంటే ముందుగా ఆముదాన్ని ఆశిస్తుందని, గుడ్లను ఆముదం ఆకులపై పెడుతుందని, ఒక గుడ్డు సముదాయాన్ని చేతితో ఏరి వేయడం ద్వారా కొన్ని వందల పురుగులను నివారించవచ్చునని తెలిపారు. మొక్కజొన్న పంటలో రసం పీల్చు పురుగుల ఉనికి తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. అంతర పంటగా వేసిన మినుములు అదనపు ఆదాయాన్ని అందిస్తాయని, ఎక్కడైనా రసం పీల్చు పురుగులు లేదా కాయతొలుచు పురుగుల గుడ్లు ఉంటే వేప గింజల కషాయం 5శాతం ద్రావణాన్ని పిచికారీ చేయడం ద్వారా నిర్మూలించుకోవచ్చునని తెలిపారు. ఇలా పలు పంటలకు వేయడం వల్ల పంటకు ఉపయోగపడే కీటకాలు అభివృద్ధి చెంది పంటను నాశనం చేసే పురుగులను సహజ సిద్ధంగానే నివారిస్తాయని తెలిపారు. మాతుమూరు, పాంచాలి, పద్మాపురం, పి.కోనవలస, కొటికిపెంట, కర్రివలస రైతు భరోసా కేంద్రాల పరిధిలో పత్తి పంట నమూనాలను వేయించారు. ఈ మోడల్‌తో రైతులు అతి తక్కువ ఖర్చుతోనే పర్యావరణ హితంగా చీడిపీడలను నివారించుకోవడమే కాకుండా పొందవచ్చని, దీనివల్ల పత్తి పంట దిగుబడి, నాణ్యత పెరుగుతాయని వ్యవసాయ అధికారి అన్నారు. కార్యక్రమంలో ఆయా రైతు సేవా కేంద్రాల విఎఎలు, ఎపిసిఎన్ఎఫ్‌సిఆర్‌పి సూర్యారావు, ఐసిఆర్ పి.సుకరమ్మ రైతులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం నశించాలి : రాజన్నదొర

అంబేద్కర్ విగ్రహం కూల్చివేతపై వైసిపి నిరసన

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రం లో అమలవుతున్న రెడ్ బుక్ రాజ్యాంగం నశించాలని, అంబేద్కర్ రాజ్యాంగానికి రక్షణగా ప్రజలు నిలబడాలని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర డిమాండ్ చేశారు . విజయవాడలో ఇటీవల వైసిపి ప్రభుత్వం హయాంలో నిర్మించిన అంబేద్కర్ భారీ విగ్రహాన్ని టిడిపి దుండగులు కూల్చివేతకు చేసిన ప్రయత్నానికి నిరసనగా వైసిపి చేపట్టిన నిరసన కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. పట్టణంలోని బంగారమ్మపేట అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అంబేద్కర్ రాజ్యాంగానికి విరుద్ధంగా పాలన సాగిస్తోందని అన్నారు. ప్రజాస్వామ్య వాదులంతా దీన్ని ఖండించాలని కోరారు. దీనిపై గవర్నర్ దీనిపై దృష్టి సారించాలని రాజన్నదొర కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పిరిడి రామకృష్ణ, మద్దిల గోవింద రావు,జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్ గొర్లి వెంకటరమణ పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ శిలాఫలకంపై దాడి జరగడం, దీన్ని ఒక సామాజిక దళిత హోంమంత్రి ఖండించకపోవడం దౌర్భాగ్యమని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, కూటమి ప్రభుత్వం గురువారం రాత్రి విజయవాడ నడిబొడ్డున గల అంబేద్కర్ విగ్రహ శిలా ఫలకాన్ని సుత్తులతో, ఇతర పరికరాలతో దాడి చేసిన ఘటనకు నిరసనగా పార్వతీపురంలో వైసిపి శ్రేణులు నిరసన చేపట్టాయి. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానికంగా ఇందిరా కాలనీ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూల మాలలు వేసి జోహార్లు అర్పించారు. ప్రభుత్వం తక్షణం స్పందించి దోషులను గుర్తించి, వారికి తగిన శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, జడ్పీటీసీ మామిడి బాబ్జీ, ఎంపీపీలు మజ్జి శోభారాణి, ప్రతినిధి బలగ శ్రీరాములు నాయుడు, పట్టణ, మండల వైసిపి అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, బొమ్మి రమేష్, బొంగు చిట్టి రాజు, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైస్ ఎంపిపిలు, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జోగారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలోని హడ్డుబంగి జంక్షన్ మెయిన్ రోడ్‌పై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు కథనం ప్రకారం హడ్డుబంగికి చెందిన గంటా బెల్లం మెయిన్‌రోడ్డును దాటుతుండగా, అదే సమయంలో కొత్తూరు నుండి ద్విచక్ర వాహనంతో అప్పారావు కొత్తూరు వైపు వెళ్తున్నారు. బెల్లంను తప్పించబోయి బైక్ హ్యాండిల్ తగలడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. బెల్లంకు స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించారు. అప్పారావును చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎస్ఐ ఎం.జగదీష్ నాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.